క్లుప్తంగా

దేవదాయశాఖ మంత్రికి ఆహ్వానం



మంత్రి కొట్టు సత్యనారాయణకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం వద్ద నిర్మించిన శ్రీవారి పుష్కరిణి ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఆహ్వానించారు. దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు, తుని గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, లోవదేవస్థానం ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, తుని వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అన్నవరం శ్రీను, ధర్మకర్తలు ఆదివారం తాడేపల్లిగూడెంలోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. శ్రీవారి పుష్కరిణిని మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభిస్తారని, రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆత్మీయ అతిథిగా పాల్గొంటారని ఆలయ చైర్మన్ భీమేశ్వరరావు తెలిపారు. అదేరోజు మహాలక్ష్మీ అమ్మవారు, పాండురంగస్వామి, భూ వరహా స్వామి, శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి, పంచముఖ ఆంజనేయస్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కాకినాడ ఎంపీ వంగా గీత, కాకినాడ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలను ఆహ్వానించినట్టు ఆయన వివరించారు.

ముమ్మరంగా అపరాల పంట కోతలు



ఎస్.అన్నవరంలో మినప చేను కోస్తున్న కూలీలు

తుని రూరల్: వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలో రబీ అపరాల పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సంవత్సరం తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో రబీలో ఆరుతడి పంటలుగా 6663 ఎకరాల్లో మినుము, 7918 ఎకరాల్లో పెసర పైర్లను రైతులు సాగు చేశారు. పంట పక్వానికి రావడంతో తుని మండలంలోని ఎస్.అన్నవరం, వల్లూరు, ఎ.అగ్రహారం, చామవరం, హంసవరం, హెచ్.కొత్తూరు, టి.తిమ్మాపురం, గవరపేట, టి.వెంకటాపురం, డి.పోలవరం, తదితర గ్రామాల్లో మినుము, పెసర కోతలను రైతులు ప్రారంభించారు. కోసిన పైర్లు ఎండిన తర్వాత నూర్పిడి చేసేందుకు రైతులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా అపరాల పంట కోతలతో మహిళా కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది. రోజుకు రూ.300 కూలి ఇస్తున్నారని మహిళా కూలీలు తెలిపారు.

వైభవంగా క్షీరాధివాసం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద నిర్మించిన శ్రీవారి పుష్కరిణి ప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం మహాలక్ష్మీ అమ్మవారు, పాండురంగ స్వామి, భూ వరహా స్వామి, శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి, పంచముఖ ఆంజనేయస్వామివారి విగ్రహాలకు ఆదివారం వైభవంగా క్షీరాధివాసం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసి విగ్రహాలను ఉంచిన ప్రదేశాన్ని పాలతో నింపివేశారు. ఈ సందర్భంగా యాగశాలార్చన, కలశారాధన, స్వామి, అమ్మవార్ల మూలమంత్ర హోమాదులు, చక్రాబ్జ మండల ఆరాధన, లఘు పూర్ణాహుతి, వాహన సేవ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అతివేగం.. అనర్థం

- రహదారి భద్రతా నిబంధనలు పాటించని ద్విచక్ర వాహనదారులు
- వేగంగా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్న యువత
- హెల్మెట్ లేకపోవడంతో ప్రాణాపాయం
- భద్రతా ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు చేపడుతున్న పోలీసులు



కిర్లంపూడిలో హెల్మెట్లు ధరించాలంటూ బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు

కిర్లంపూడి: రహదారి భద్రతా నిబంధనలకు పాతరేస్తూ ఇరుకు సందులు, విశాలమైన రోడ్లు అనే తేడా లేకుండా అనేక మంది యువత అతి వేగంగా వాహనాలను నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారు. అతి వేగంతో తమ ప్రాణాల మీదకు తెచ్చుకోవడమే కాకుండా అభంశుభం తెలియని ఇతరులను కూడా ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. శక్తి వంచన లేకుండా పోలీసులు ఎన్ని రకాలుగా అవగాహన కల్పిస్తున్నా కొందరిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్న వారి బండ్లు సీజ్ చేసినా, జరిమానాలు విధించినా ఖాతర్ చేయడం లేదు. రోడ్డు భద్రతా వారోత్సవాలు పేరిట ఇటీవల పోలీసులు ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. చాలా మంది ద్విచక్ర వాహనదారులు తమ చేతిలో బైక్ ఉంది కదా అని వెనుకా ముందు చూసుకోకుండా మితిమీరిన వేగంతో నడుపుతూ ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులు కావడంతో పాటు మృత్యువు ఒడికి చేరి ఆయా కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగుల్చుతున్నారు.

ప్రమాదాలు ఇలా...

నియోజకవర్గంలో 2017 నుంచి 2022 వరకు బైక్ ప్రమాదాల్లో సుమారు 48 మంది మరణించారు. 50 మందికిపైగా ఆసుపత్రుల పాలవ్వగా 60 మందిపై కేసులు నమోదు అయ్యాయి.

వీరి కుటుంబ శోకాన్ని తీర్చేదెవరు

- ఇటీవల పెళ్లిచూపులకు అని సామర్లకోట నుంచి కిర్లంపూడి వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న 25 ఏళ్ల యువకుడిని రాజుపాలెం దగ్గర ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన ఆ వ్యక్తిని 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ ప్రాణం విడిచాడు.
- ఒకే బైక్‌పై భీమవరం నుంచి అన్నవరం వెళ్తున్న ముగ్గురు యువకులు ముందు వెళ్తున్న ట్రక్కును బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు చికిత్స పొందుతూ మరణించగా ఒకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు.
- ఇటీవల కిర్లంపూడి నుంచి సామర్లకోట వైపు వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వేగంగా బైక్‌పై వచ్చిన యువకుడు బలంగా ఢీకొట్టిన సంఘటన రాజుపాలెం వ్యవసాయశాఖ చెక్‌పోస్ట్ వద్ద చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తన కాలు విరిగిపోయి మంచాన పడ్డాడు. ఎంతో మంది రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు, చేతులు, వెన్నెముకలు విరిగిపోయి దీర్ఘకాలంగా మంచానికే పరిమితమై నరక యాతన అనుభవిస్తున్నారు. ఇలా అనేక మంది ప్రమాదాల బారిన పడి మంచం పట్టడంతో వీరిపై ఆధారపడి ఉన్న కుటుంబాల బాధ వర్ణనాతీతం.

పోలీసుల కంటపడకుండా...

డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు ఏ విధమైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, నిబంధనలు పాటించకపోవడం లాంటి పరిస్థితుల్లో పోలీసులు, ఆర్టీఏ అధికారులకు చిక్కకుండా తప్పించుకోవాలనే ఉద్దేశంతో అతి వేగంతో పాటు ఇరుకు సందులు, దొడ్డిదారులను అన్వేషించి ప్రయాణిస్తున్నారు. ఈ మధ్య పోలీసులను మాయ చేయడంలో భాగంగా తమకు ఎటువంటి సంబంధం లేకపోయినా ప్రెస్, ఆర్మీ, పోలీస్, రెవెన్యూ, డాక్టర్ ఇలా అనేక రకాల స్టిక్కర్లు తమ ద్విచక్ర వాహనాలకు అతికించి తప్పుడు మార్గాల్లో ప్రయాణిస్తూ పోలీసులకు పట్టుబడుతున్న దృశ్యాలు ఇటీవల అనేకం చూస్తున్నాం.



హెల్మెట్ ధారణపై యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రఘునాథరావు

నిబంధనలు పెడచెవిన పెడుతున్న యువత

గంట సమయం లేటు అయినా పర్లేదు సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలంటూ పోలీసులు మొత్తుకుంటున్నారు. హెల్మెట్ ధరించాలని హెచ్చరిస్తూ, నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలు నడుపుతున్న వారిపై జరిమానాలు విధిస్తున్నారు. యువతలో మార్పు తీసుకురావాలని అనేక రకాలుగా వినూత్న కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు చేపడుతున్నారు. అయినా యువత మాత్రం ఆ విషయాన్ని పెడచెవిన పెట్టి ఒకే బైక్‌పై ముగ్గురు వీలైతే నలుగురు ఎక్కి అతి వేగంగా ప్రయాణిస్తున్నారు. రోడ్డు భద్రతా చట్టాలపై పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా క్షేత్రస్థాయిలో యువతలో మాత్రం పెద్దగా మార్పు కనిపించడంలేదు.



ఒకే బండిపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు

తల్లిదండ్రులు బాధ్యత వహించాలి



తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు. రహదారి నిబంధనల ప్రకారం మేజర్లు అయ్యి ఉండి, డ్రైవింగ్ లైసెన్స్ పొందినప్పుడు మాత్రమే వాహనాలు తమ పిల్లలకు ఇవ్వాలి. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– టి. రఘునాథరావు, ఎస్సై, కిర్లంపూడి

మానవత్వం చాటిన ఎస్సై విద్యాసాగర్

జగ్గంపేట: స్థానిక మెయిన్ సెంటర్లో ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనదారుడికి ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ సపర్యలు చేసి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాజపూడి నుంచి స్కూటీపై జగ్గంపేట వస్తున్న ఓ వ్యక్తి బ్రిడ్జ్ వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తూ వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. విధి నిర్వహణలో ఉన్న ఎస్సై క్షణాల్లో అక్కడకు చేరుకుని ప్రమాదానికి గురైన వాహనదారుడికి సపర్యలు చేశారు. అతడు కొలుకున్న తరువాత ధైర్యం చెప్పి పంపారు. దీంతో ఎస్సై విద్యాసాగర్‌ను స్థానికులు అభినందించారు.

ముంపు నివారణకు చర్యలు



ప్రభుత్వ ఆసుపత్రిలో ముంపును పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేత చలమయ్య

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ముంపు నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు వైఎస్సార్ సీపీ నేత, మున్సిపాల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య తెలిపారు. తిమ్మరాజు చెరువు ప్రధాన కాలువలోని నీరు ముంచెత్తడంతో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం ముంపునకు గురైంది. దీంతో ఆదివారం చలమయ్య ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మరాజు చెరువు ప్రధాన కాలువ గట్లు దెబ్బతినడంతో ఆసుపత్రి ప్రాంగాణం ముంపునకు గురైందన్నారు. సమస్యను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోనాల వెంకటరమణ, దాకమర్రి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు



బొర్రంపాలెం శివారులో దాబా వద్ద నుంచి రోడ్డుపైకి వస్తున్న భారీ లారీ వల్ల నిలిచిన ట్రాఫిక్

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారి వెంబడి ఉన్న దాబాలు, హోటళ్ల వద్ద వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని సుమారు 20 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జాతీయ రహదారి వెంబడి మురారి, గండేపల్లి, మల్లేపల్లి, తాళ్లూరు, నీలాద్రిరావుపేట, బొర్రంపాలెం, జెడ్.రాగంపేట గ్రామాల్లో దాబాలు, హోటళ్లు, టీ టైమ్స్, ఇతర దుకాణాలు వెరసి సుమారు 30 వరకు ఉన్నాయి. ఇక్కడకు వచ్చే వాహనదారులు రోడ్డును ఆనుకుని తమ వాహనాలు నిలిపివేయడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీనికి తోడు ఇతర వాహనదారులు ఈ వాహనాలను ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. నిలుపుదల చేసిన భారీ వాహనాలు, కంటైనర్లు మళ్లీ రోడ్డుపైకి వచ్చేటప్పుడు అదే మార్గంలో వచ్చే వాహనాలు, ముందు వెళుతున్న వాహనాలను ఢీకొంటున్నాయి. ఇటీవల తాళ్లూరు శివారులో దాబాల వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. రాత్రి సమయాల్లో దాబాల వద్ద జరిగిన ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారిపై భారీ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రేపటిలోగా పన్నులు చెల్లించాలి

తుని: పురపాలక సంఘం పరిధిలోని వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ పన్నును మంగళవారం లోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఆర్థిక సంవత్సరం ముగింపులో భాగంగా డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్‌కు ఈ నెల 28తో గడువు ముగిస్తుందన్నారు. అపరాధ రుసుము లేకుండా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో పన్ను చెల్లించాలన్నారు. వ్యాపారులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ధారపల్లి జలపాతం వద్ద యాత్రికుల సందడి



ధారపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న యాత్రికులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధారపల్లి జలపాతం వద్ద ఆదివారం యాత్రికులు సందడి చేశారు. సెలవు దినం కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ధారపల్లి జలపాతానికి భారీగా యాత్రికులు తరలివచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి జలపాతం వద్ద స్నానాలు చేసి సందడి చేశారు. జలపాతం ప్రాంగాణంలో ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సహంగా గడిపారు. యువత కేరింతలు కొట్టారు.

ఘనంగా అడవి రాజులబాబు పండగ



కేఎస్ కొత్తూరులో రాజులబాబు గుడికి ర్యాలీగా తరలి వెళుతున్న గ్రామస్తులు

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాం పంచాయతీ కేఎస్ కొత్తూరులో అడవి రాజులబాబు పండగ ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ భారీ ర్యాలీగా గ్రామ శివారులో ఉన్న అడవి రాజులబాబు ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. పండగ సందర్భంగా ఇతర గ్రామాల నుంచి వచ్చిన బంధుమిత్ర పరివారంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దల సహకారంతో సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడిలో కొండ రాజులబాబును దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా కొండరాజులబాబు పండగ

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో ఆదివారం కొండరాజులబాబు పండగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శెట్టిబలిజ సామాజిక వర్గీయుల ఆధ్వర్యంలో ఈ పండగ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు కొండరాజులబాబును దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. చినశంకర్లపూడి, పెద శంకర్లపూడి, లంపకలోవ, ఏలూరు తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

హిందూధర్మ పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న త్రినాథ్

శంఖవరం: సమాజంలో ప్రతిఒక్కరూ హిందూ ధర్మ రక్షణకు పాటు పడాలని సమరసత సేవా ఫౌండేషన్ కార్యదర్శి పాకాల త్రినాథ్ కోరారు. మండలంలోని కత్తిపూడి సీతారామా కళాశాలలో సమరసత ఫౌండేషన్ కన్వీనర్లు, సహ కన్వీనర్లతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో హిందూ ధర్మంపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ మరింత బలోపేతం కావాలంటే ధార్మిక సంఘాల నిర్మాణం బలంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నందూరి కృష్ణ, ముద్దు జనార్దన్, కంబాల నారాయణరావు, గంధం వెంకటలక్ష్మి, పడాల రఘు తదితరులు పాల్గొన్నారు.

9న ఉద్యోగుల నిరసన

తుని: రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 9న నిర్వహించే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శివాజీ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. విజయవాడ రెవెన్యూభవన్‌లో జరిగిన ఏపీజేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

తుని: స్థానిక రోటరీక్లబ్ హాలులో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ కరాటే పోటీల్లో తుని పట్టణానికి చెందిన దేవి శ్రీలక్ష్మి ప్రతిభ చూపినట్టు కరాటే కోచ్ సాకా రమణ తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. తుని శ్రీచైతన్యలో ఒకటో తరగతి చదువుతున్న తుని రూరల్ ఎస్సై బాలాజీ కుమార్తె అన్నంరెడ్డి దేవిశ్రీలక్ష్మి ప్రథమ స్థానం సాధించిందన్నారు. ప్రతిభ చూపిన దేవిశ్రీలక్ష్మిని పలువురు అభినందించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రోటరీక్లబ్ తరఫున మెడల్స్ అందజేశారు.



రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన దేవి శ్రీలక్ష్మికి పతకం అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీవారికి శేష వాహనం సమర్పణ

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి (శ్రీవారికి) ఆదివారం భక్తులు శేష వాహనం సమర్పించారు. ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన భీమనాథుల అప్పారావు (జమీలు), కృష్ణజ్యోతి దంపతులు శేష వాహనాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ శేష వాహనంపై శ్రీవారిని గోవింద మాల ధారణ భక్తులు, అర్చకులు వైభవంగా ఊరేగించారు.

దాత సమర్పించిన శేష వాహనంపై శ్రీవారిని ఊరేగిస్తున్న భక్తులు



అవసరమైతే.. చాటుకు వెళ్లాల్సిందే

- ప్రభుత్వ కార్యాలయాల వద్ద కానరాని మరుగుదొడ్లు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహిళలు
- పట్టించుకోని అధికారులు

ప్రత్తిపాడు: ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలని, ఆరు బయట మల విసర్జన చేస్తే వ్యాధులు వ్యాప్తి చెందుతాయని అధికారులు నిత్యం చెబుతున్నారు. స్వచ్ఛభారత్‌తో భాగంగా ప్రభుత్వం మారుమూల గ్రామాల్లో సైతం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మిస్తోంది. కాగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద మాత్రం మరుగుదొడ్లు ఉండడం లేదు. దీంతో ఆయా కార్యాలయాలకు వచ్చే లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్తిపాడు మండల కేంద్రానికి నిత్యం ఏదో పని నిమిత్తం స్త్రీలు, పురుషులు వస్తుంటారు. పల్లెలకు మండల కేంద్రం పదుల కిలోమీటర్ల దూరంలో ఉన్నా పనులన్నీ అక్కడే జరుగుతాయి. భూ సమస్యల పరిష్కారం, రుణాల కోసం, భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, సబ్ ట్రెజరీ ఇలా అనేక సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. కాగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ పనుల కోసం వేచి చూసే వారికి కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ పథకాలను అమలు చేసే కార్యాలయాల వద్దే స్వచ్ఛ స్ఫూర్తి కానరాకపోవడం అధికారుల చిత్తశుద్ధికి అద్దం పడుతోంది.



ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కక్షిదారులు

మండల కేంద్రమైన ప్రత్తిపాడులో మండల ప్రజా పరిషత్, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, సబ్ జైలు, గృహ నిర్మాణం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం, మండల రిసోర్సు సెంటర్, మండల విద్యాశాఖ కార్యాలయం, వైఎస్సార్ క్రాంతిపథం – మహిళా సమాఖ్య కార్యాలయం అన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. గృహ నిర్మాణ కార్యాలయం శిథిలం కావడంతో దానిని మూసేసి, ఉపాధి కార్యాలయంతో పాటు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బందికి మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. ఈ కార్యాలయాలకు వచ్చే వారి కోసం కనీసం ఒక్క మరుగుదొడ్డి సైతం లేదు.

మహిళలకు అవస్థే..

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళల అవస్థలు వర్ణనాతీతం. మండల కేంద్రానికి వివిధ ప్రాంతాల నుంచి రోజుకు 500 మంది వరకు ప్రజలు వివిధ పనులపై వస్తుంటారు. అత్యవసర సమయంలో మరుగుదొడ్డి అందుబాటులో లేకపోవడంతో కార్యాలయాల గోడల చాటుకు వెళ్లాల్సిన దుస్థితి. నిబంధనల ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే లబ్ధిదారుల కోసం మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలి. ఉద్యోగులు, సిబ్బంది, కార్యాలయాలకు వచ్చే వారికి అందుబాటులో ఉండాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సులబ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి



ప్రతీ రోజూ మండలంలోని వివిధ గ్రామాలతో పాటు సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని గ్రామాల ప్రజలు పలు అవసరాల నిమిత్తం ప్రత్తిపాడు వస్తున్నారు. కక్షిదారులు, విక్రయదారుల్లో మరుగులేక మహిళలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి.

– పంచదార్ల నాగేశ్వరరావు (గురుస్వామి), దస్తావేజు లేఖర్ల సంఘ నాయకుడు, ప్రత్తిపాడు

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- ఇరుకు భవనాల్లో నిర్వహణ
- అసంపూర్తిగా నిలిచిపోయిన శాశ్వత భవన నిర్మాణ పనులు

ఏలేశ్వరం: గత ప్రభుత్వ హయాంలో అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ప్రస్తుతం అంగన్‌వాడీ సిబ్బంది పాలిట శాపంగా మారింది. మండల వ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని శంఖవరం సెక్టార్‌లో 13 అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాలు, 33 అద్దె భవనాలు, పెద్దాపురం సెక్టార్‌లో ఏడు సొంత భవనాలు, ఆరు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

మండలంలో ఇలా..

మండలంలోని కొత్త యర్రవరం, యర్రవరం, పెద్దనాపల్లి గ్రామాలు పెద్దాపురం సెక్టార్‌లో ఉండగా మిగిలిన ఏలేశ్వరం, లింగంపర్తి, సిరిపురం, పేరవరం, భద్రవరం, జె.అన్నవరం, మర్రివీడు, తూర్పు లక్ష్మీపురం, రమణయ్యపేట తదితర గ్రామాలు శంఖవరం సెక్టార్‌లో ఉన్నాయి. కాగా అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న అద్దెభవనాల్లో సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. అద్దెభవనాలు ఇరుకుగా ఉండడంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు అక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. కేంద్రాలను అద్దె భవనాల్లోని ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. అలాగే గర్భిణులు కూర్చునేందుకు ఫర్నిచర్ లేకపోవడంతో నేలపైనే పౌష్టికాహారం తీసుకోవల్సి వస్తోంది



రమణయ్యపేటలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం



క్వారీ ప్రాంతంలో మధ్యలోనే నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

నిలిచిపోయిన నిర్మాణ పనులు

ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న సొంత భవనాల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఏలేశ్వరంలోని క్వారీ ప్రాంతంలో సుమారు ఐదేళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన భవనం శ్లాబ్ వరకూ వచ్చి గోడలతో నిలిచిపోయింది. రమణయ్యపేట గ్రామంలో సగానికి పైగా నిర్మాణం జరిగి నిధులు చాలక మధ్యలోనే ఆగిపోయింది. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారిని వివరణ కోరగా నూతన భవనాల నిమిత్తం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.